సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం ❘ 11 ❘ ఆగస్టు ❘ 2024



సోమశిలలో 16.261 టీఎంసీలు

సోమశిల: జలాశయం శనివారానికి 16.261 టీఎంసీలకు చేరుకుంది. 12,432 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,450
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,644
నవర (8 గ్రాములు)	రూ.53,152

గరిష్టం/కనిష్టం
36.2 /27.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లి తిరిగి వచ్చిన ఎంపీడీఓలకు పోస్టింగ్‌లను కేటాయిస్తూ జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. డీవీ నరసింహారావును బుచ్చిరెడ్డిపాళెం, ఎం.బ్రహ్మయ్య కొండాపురం, టీ సింగయ్య దొరవారిసత్రం, ఎం.గోపి సంగం, పీ ఐజాక్‌ప్రవీణ్ ఆత్మకూరు, ఎం.భాస్కర్ ఏఎస్‌పేట, ఎం. మధుసూదన్‌రావు అనంతసాగరం, కె.నాగేంద్రబాబు ఇందుకూరుపేట, కె.ప్రత్యూష ముత్తుకూరు, కె.గోవర్ధన్ కలువాయి, జీ వెంకటేశ్వర్లు మనుబోలు, కె.వెంకటేశ్వరరావు గూడూరు, వీవీ సూర్యసాయి చిల్లకూరు, ఎం.భవాని కోట, కె షాలెట్ చిట్టమూరు, కె సురేష్‌బాబు పెళ్లకూరు, పీ ప్రసన్నకుమారి డక్కిలి, ఏ ప్రమీలారాణి సూళ్లూరుపేట, టీ నాగేష్‌కుమారి పొదలకూరు, పీ నాగమణి మర్రిపాడు, ఏవీ సుబ్బారావు బోగోలు, ఎం.శ్రీహరి కోవూరు, పీ సుబ్రహ్మణ్యం కొడవలూరు, వీ రజనీకాంత్ ఓజిలి, కేవీ కోటేశ్వరరావు వెంకటగిరికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డీసీపల్లిలో 712 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 712 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 882 బేళ్లు రాగా 712 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 88,337 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,57,90,508 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204 లభించింది. సగటు ధర రూ.291.95 నమోదైంది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్ట్


ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు శనివారం తెలిపారు. 1వ యూనిట్లో 420 మెగావాట్లు, 2వ యూనిట్లో 425 మెగావాట్లు, 3వ యూనిట్లో 700 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

బస్తా నిమ్మకాయలు రూ.9 వేలు



పొదలకూరు : నిమ్మకాయలకు మార్కెట్లో డిమాండ్ పెరుగుతోంది. నాలుగు రోజులుగా కాయల ధరలు ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం లూజు బస్తా రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కిలోల వంతున చూసుకుంటే రూ.80 నుంచి రూ.110 వరకు ధరలు పెరిగాయి. బయట ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణంగా భావిస్తున్నారు. ఢిల్లీ మార్కెట్‌లో కాయల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. రానున్న రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ సీజన్లో ఆశించిన స్థాయిలో ధరలు, కాయలు కూడా లేవు. కానీ ధరలు మాత్రం పెరుగుతున్నాయి. ఈ ఏడాది పండు కాయల ధరలు కూడా పెరిగాయి. నాణ్యత కలిగిన పచ్చికాయల (గ్రీన్ కలర్)కు డిమాండ్ బాగా పెరుగుతోంది. ఆగస్టులో ఇంత స్థాయిలో ధరలు పెరగడం గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు అంటున్నారు.

తమ్ముళ్లకు ఎక్సైజ్ గులాంగిరి



- అనధికారికంగా షాపుల స్వాధీనం, టీడీపీ నేతలకు అప్పగింత
- ఎక్సైజ్‌శాఖ అత్యుత్సాహం
- ఒక్కోదుకాణంలో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల స్టాక్
- గతంలో మద్యం స్టాక్‌కు సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు బ్యాంక్ గ్యారెంటీ
- సరుకు స్వాధీనం చేసుకుంటూ హామీపత్రాలివ్వని ఎక్సైజ్‌శాఖ
- స్టాక్, నగదు లెక్కలపై సర్వత్రా ఆందోళన
- స్టాక్ అమ్మేసుకుని సూపర్‌వైజర్లను బాధ్యులను చేసే కుట్రలు

అధికారం చేజిక్కినప్పటి నుంచి టీడీపీ నేతల దోపిడీలకు, దాష్టీకాలకు హద్దులు ఉండడం లేదు. బరితెగించి సహజ వనరులను దోచుకుంటున్న వీరు తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అనధికారికంగా తిష్ట వేశారు. రూ.కోట్ల మద్యం స్టాక్‌లను కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు టీడీపీ నేతలకు గులాంగిరి చేస్తున్నారు. ఇప్పటి వరకు మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న వారిని బయటకు నెట్టేసి స్టాక్ మొత్తం టీడీపీ నేతలకు అనధికారికంగా అప్పగిస్తున్నారు. దుకాణాల్లో సాక్టకు వీరు బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చారు. ఈ స్టాక్‌కు, దుకాణంలో నగదు నిల్వలపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎక్సైజ్ శాఖాధికారులు తిలాపాపం.. తలాపిడికెడు మూటగట్టుకుంటున్నారు. టీడీపీ నేతల దోపిడీకి గ్రీన్ కార్పెట్ పరిచి మరీ అండదండలు అందిస్తున్నారు. గడిచిన రెండు నెలలుగా ఇసుక, మట్టి, గ్రావెల్ దోచుకుంటున్న పచ్చ దొంగలు తాజాగా కందుకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దూరేశారు. అనధికారికంగా వైన్ షాపుల్లో తిష్టవేసి ప్రభుత్వ సొమ్మును కాజేసే కుతంత్రానికి తెరతీశారు. ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లోనే విధులు నిర్వర్తిస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లను అనధికారికంగా బలవంతంగా తొలగించి వారి స్థానంలో తమ్ముళ్లను చేర్చేశారు. దుకాణాల్లోని రూ.కోట్లలో విలువైన మద్యం నిల్వలను ఎలాంటి గ్యారెంటీలు లేకుండానే దొంగ చేతికి తాళాలిచ్చినట్లుగా అప్పగించారు. గతంలో ఇదే షాపుల్లో స్టాక్‌కు ష్యూరిటీ బాండ్లు ఇచ్చిన సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లకు కనీసం స్టాక్ స్వాధీనం చేసుకున్నట్లు హామీ పత్రాలివ్వకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

స్వాధీనం చేసుకున్న స్టాక్‌కు ఎవరు బాధ్యులు?

ప్రతి షాపులో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువ చేసే మద్యం స్టాక్ ఉంటుంది. బాగా డిమాండ్ ఉన్న షాపులో అయితే ఇంకా ఎక్కువే ఉంటుంది. ఈ స్టాక్‌కు సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చి

అనధికారికంగా టీడీపీ నేతలకు అప్పగింత

టీడీపీ అధికారంలోకి రావడంతో కందుకూరు ఎమ్మెల్యే చిరుద్యోగులను టార్గెట్ చేశారు. అందులో భాగంగా ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా పనిచేస్తున్న దాదాపు 70 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వారి స్థానంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు సిఫార్సు చేసిన వారిని నియమిస్తున్నారు. అయితే వీరి నియామకానికి సంబంధించి ఎక్సైజ్ శాఖ నుంచి ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేవు. ఇష్టారీతిన ఉద్యోగాలిచ్చి మద్యం దుకాణాలను వారికి అప్పగిస్తున్నారు. ఎటువంటి అధికారిక నియామకం లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్న వీరంతా మద్యం అమ్మిన సొమ్మును కాజేస్తే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీని వల్ల ఏవైనా అవకతవకలు జరిగితే వారిని బాధ్యులను చేయడానికి కుదరదు.

ఉన్నారు. నిత్యం ఒక షాపులో కనిష్టంగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నగదును మొత్తం ఎప్పటికప్పుడు బ్యాంక్‌ల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఎంత సరుకు అమ్ముతున్నారు. ఎంత స్టాక్ ఉందనే వివరాలు దుకాణం మూసివేసే సమయంలో కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంది. ఇప్పుడు ఈ స్టాక్‌తో పాటు దుకాణంలో సేల్స్ జరిగిన నగదు ఎక్సైజ్ అధికారులు అనధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. వీటిని టీడీపీ నేతలకు అప్పగించారు.

స్టాక్, నగదుకు సంబంధించి కనీసం హామీ పత్రం కూడా ఇవ్వకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా ఉంది. ఈ స్టాక్ అంతా టీడీపీ నేతలు అమ్మేసుకుని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకపోతే ఎవరు బాధ్యత వహించాలి?. అనధికారికంగా స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులా? లేదా అనధికారికంగా అమ్మకాలు చేస్తున్న టీడీపీ నేతలా?. ఎక్సైజ్ అధికారులే సెలవివ్వాల్సి ఉంది.

ఆందోళనలో సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు

గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా ఉద్యోగాల్లో నియమించే సందర్భంలో ఓ ఏజెన్సీకి అప్పగించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగాలిచ్చారు. విధుల్లో చేరిన వారి వద్ద నుంచి ఆ దుకాణంలో ఏమి జరిగినా బాధ్యత వహించాలంటూ సెక్యూరిటీ ష్యూరిటీలు కూడా తీసుకుంది. ష్యూరిటీ బాండ్లపై ఓ ప్రభుత్వ ఉద్యోగితో సంతకం చేయించడంతో పాటు, తమకు ఉన్న పొలాలు, ఇళ్లను ష్యూరిటీగా పెట్టారు. దుకాణంలో ఏ చిన్న అవకతవకలు జరిగినా పూర్తిగా వీరే బాధ్యత వహించాల్సి వచ్చేంది. అయితే టీడీపీ నేతలతో కలిసి ఎక్సైజ్ అధికారులు గతంలో నియమితులైన సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. ష్యూరిటీ బాండ్లను మాత్రం తిరిగి ఇవ్వలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వీరు లేకపోయినా.. స్టాక్ మొత్తానికి వారిదే బాధ్యత. ఉద్యోగాల నుంచి తొలగించే సమయంలో గతంలో తాము ఇచ్చిన ష్యూరిటీలు తిరిగి ఇవ్వాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి తప్పించుకున్నారు. దీంతో జిల్లాలో ఉన్న 102 షాపులకు సంబంధించిన గత సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాము ఉద్యోగాల్లో లేమని, తమ ష్యూరిటీలు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం షాపుల్లో అవకతవకలు జరిగితే తామే బాధ్యత వహించాల్సి వస్తుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

మా ష్యూరిటీ ఇవ్వమన్నా ఇవ్వలేదు



నేను వలేటివారిపాళెం మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశాను. ఇటీవల నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ సమయంలో నేను ఇచ్చిన ష్యూరిటీలు తిరిగి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులను అడిగాను. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కొత్తగా నియమించిన వారికి నేటికీ ఎటువంటి అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు లేవు. అనధికారికంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పటికీ మద్యం స్టాక్‌కు మాదే బాధ్యతగా ఉంది. రేపు అమ్మకాల్లో ఏదైనా తేడా జరిగితే ఎవరు బాధ్యత వహించాలి. నేను ఇచ్చిన ష్యూరిటీలు నాకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను.

– వై.వెంకటస్వామి, మాజీ సూపర్‌వైజర్



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తు ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాజ్యాంగంపై రెడ్‌బుక్ దాడి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం విధ్వంసానికి టీడీపీ మూకలు తెగించారని, ఇది లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం దాడి అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు అంబేద్కర్ భవన్లోని ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కార్యకర్తలు, నాయకులతో కలిసి కొవ్వొత్తులతో కాకాణి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వెయ్యి కోట్ల విలువైన స్థలంలో రూ.404 కోట్ల ఖర్చుతో అంబేద్కర్ స్మృతివనం నిర్మించారన్నారు. టీడీపీ ముష్కరులు పోలీసుల అండదండలతో అంబేద్కర్ విగ్రహం విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో అంబేద్కర్ స్మృతివనం అమరావతిలో నిర్మిస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. జగన్ విజయవాడ నడిబొడ్డులో సామాజిక న్యాయశిల్పం పేరుతో అంబేద్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేసి విహార ప్రదేశంగా తీర్చిదిద్దడంతో జీర్ణించుకోలేకనే ప్రభుత్వం దాడి చేయించనట్లు పేర్కొన్నారు. లోకేశ్ తన పాదయాత్రలో తన ప్రత్యేక రాజ్యాంగం గురించి వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారం శాశ్వతం కాదని అధికార మార్పు జరుగుతుందని ఇలాంటి అప్రజాస్వామిక పనులు చేసే వారికి సహకరించిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం.వెంకటశేషయ్య, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు జీ.శ్రీనివాసులు, ఎం.బాలకృష్ణారెడ్డి, కే.రామిరెడ్డి, కే చలపతిరావు, లచ్చారెడ్డి, మల్లారెడ్డి, మారు వెంకట్రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండలేరులో 5.986 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 5.986 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 115, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇచ్చుకో.. తవ్వుకో

గొలగమూడి పడమటి చెరువులో గ్రావెల్ తవ్వకాలు

- రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్న తమ్ముళ్లు
- గ్రావెల్ మాఫియాను అడ్డుకున్న స్థానికులు
- వాహనాలను పోలీసులకు అప్పగించినా వదిలేసిన వైనం



గొలగమూడి ఎర్రచెరువులో రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన జేసీబీలు, ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా బరి తెగిస్తోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, గుంతలను చెరపట్టి తవ్వేస్తున్నారు. రియల్ వెంచర్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, మైనింగ్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు ధ్రుతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాయి. అక్రమార్కుల దగ్గర వాటాలు పుచ్చుకుంటూ సహజ వనరులను దోచిపెడుతున్నారు. గ్రావెల్ మాఫియా దందాను సంబంధిత శాఖల అధికారులు అడ్డుకోకపోవడంతో స్థానిక ప్రజలే అడ్డుకొనే పరిస్థితి వచ్చింది. తాజాగా వెంకటాచలం మండలం గొలగమూడిలోని ఎర్రచెరువును చెర పట్టిన తెలుగు తమ్ముళ్లు రేయింబవళ్లు గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నారు. శుక్రవారం ఆ వాహనాలను స్థానికులు అడ్డుకుని పోలీసులకు పట్టించారు. అయితే పోలీసులు మాత్రం ఆ వాహనాలను స్థానికులు అటు వెళ్లగానే ఇటు వదిలేయడం గమనార్హం.

60 రోజులుగా ఆగని దందా

సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులు అండతో గడిచిన రెండు నెలలుగా ఇసుక, గ్రావెల్, మట్టి దందా జరుగుతూనే ఉంది. అక్రమార్కులు వెంకటాచలం మండలంలో జాతీయ రహదారి పక్కనే రేయింబవళ్లు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వెంచర్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. గొలగమూడి ఎర్రచెరువులో పది రోజులుగా గ్రావెల్ తరలిస్తున్నారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో స్థానిక రైతాంగం కన్నెర్ర చేసింది. ట్రాక్టర్లు, జేసీబీలను అడ్డుకుని పోలీసులకు అప్పగిస్తే రైతులు అటు వెళ్లగానే.. ఇటు వదిలేశారు. గొలగమూడి ఎర్రచెరువులో దాదాపు 20 మీటర్లు లోతుగా గోతులు పెట్టి తవ్వేస్తున్నారు. భారీ గోతుల్లో వర్షాకాలంలో నీళ్లు చేరితే పిల్లలు ఈతకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటుకునే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎక్కడా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

గొలగమూడి ఎర్రచెరువులో గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్కడ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, ఈఈ ఇరిగేషన్ శాఖ

కల్యాణం.. కమనీయం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

నేడు చందనాలంకరణ

లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆదివారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడ సేవ నిర్వహిస్తామన్నారు.

పచ్చని సంసారంలో చిచ్చురేపిన మద్యం



సురేఖ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ, తహసీల్దార్



నాగరాజు మృతదేహం

- ఉరేసుకుని భార్య, రైలు కిందపడి భర్త ఆత్మహత్య
- అనాథలైన ఇద్దరు బిడ్డలు
- ఎన్‌టీఆర్ నగర్‌లో విషాదం

నెల్లూరు (క్రైమ్): పచ్చని సంసారంలో మద్యం చిచ్చు రేపింది. ఉరేసుకుని భార్య, రైలు కింద పడి భర్త ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన నెల్లూరు నగరం ఎన్టీఆర్‌నగర్‌లో శనివారం జరిగింది. అభం శుభం తెలియని ఇద్దరు బిడ్డలు అనాథలయ్యారు. దంపతులు బలవన్మరణం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఏం జరిగిందో తెలియక మృతుల కుమారులిద్దరూ అటు ఇటూ తిరుగుతూ ఉండడం చూపరులను కంట తడి పెట్టించింది. ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన కె. నాగరాజు(23), సురేఖ (19) నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. స్థానికంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారు. వారికి మూడేళ్ల, పదకొండు నెలల కుమారులు ఉన్నారు. నాగరాజు మార్బుల్స్, టైల్స్ పనులు చేసుకుంటుండగా, సురేఖ మాగుంట లేఅవుట్‌లోని ఓ బ్యూటీ పార్లర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు సంతోషంగా సాగుతున్న వీరి కాపురాన్ని మద్యం విచ్ఛిన్నం చేసింది. మద్యానికి బానిసైన నాగరాజు సంపాదించిందతా మద్యానికి ఖర్చు చేయడంతో పాటు అప్పులు చేశాడు. దీంతో కుటుంబ భారం సురేఖపై పడింది. ఆమె తాను సంపాదించిన మొత్తంలో కొంత కుటుంబ పోషణకు ఖర్చు చేసి మిగిలిన దాంతో అప్పులు తీర్చింది. పలుమార్లు మద్యం మానేయమని, అప్పులు చేయొద్దని భర్తను ప్రాధేయపడింది. అయినా అతని తీరులో మార్పు రాలేదు. కొద్ది రోజులుగా పుట్టింటికి వెళ్లి నగదు తీసుకురావాలని భార్యపై ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో వారి మధ్య మనస్పర్థలు పెరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం నాగరాజు పని నిమిత్తం బయటకు వెళ్లగా సురేఖ తన ఇంట్లోనే ఉరేసుకుంది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు గీత, సురేష్ హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకుని ఆమెను కిందకు దించారు. ఆమెను నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సురేఖ మృతి చెందిందని నిర్ధారించారు. భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న నాగరాజు హాస్పిటల్ వద్దకు వెళ్లి కన్నీరు మున్నీరయ్యారు. భార్య లేని జీవితం వ్యర్థమంటూ రోదించాడు. ఇక తాను బతకలేనంటూ అక్కడి నుంచి పరుగున వెళ్లి విజయమహల్ రైల్వే గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు అతన్ని పట్టుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. గంటల వ్యవధిలోనే దంపతులిద్దరూ ఆత్మహత్య చేసుకోవడం అందరి హృదయాలను కలిచి వేసింది. సురేఖ ఆత్మహత్య ఘటనపై సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఎస్‌ఐ విజయ్‌శ్రీనివాస్, నెల్లూరు తహసీల్దార్ హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి దీప్తి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నాగరాజు ఆత్మహత్య ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలకతీతంగా జిల్లా అభివృద్ధి

- జెడ్పీ సమావేశంలో మంత్రులు ఆనం, నారాయణ



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, చిత్రంలో మరో మంత్రి నారాయణ, జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా పరిషత్ సభ్యులందరూ పార్టీలకతీతంగా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ కోరారు. శనివారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జెడ్పీ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని తమ ప్రాంత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 85 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, రైతుల సమస్యలపై జెడ్పీ సమావేశాల్లో చర్చించాలన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్‌లకు చిన్న చిన్న మరమ్మతులు, నిర్వహణ కొరవడిందన్నారు. జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్ట్‌ల ఆయకట్టును స్థిరీకరిస్తామని, సోమేశ్వరాలయాన్ని దేవదాయశాఖ నిధులతో పూర్తి చేస్తామన్నారు. కేవలం రవాణా ఖర్చులు వసూలు చేస్తూ ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తామని, ఇసుక ద్వారా వచ్చిన కొద్ది మొత్తాన్ని కూడా స్థానిక సంస్థలకే జమ చేస్తామన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని దేవాలయ భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తామన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత : నారాయణ

వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. జిల్లాలో విత్తనాలు, యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని, పంట చేతికొచ్చాక అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. మండల కేంద్రాల్లో శీతల గిడ్డంగుల నిర్మాణానికి, హార్టికల్చర్ విభాగంలో కొబ్బరిని జోడించి జిల్లా రైతులు కొబ్బరి పంట సాగు చేసే విధంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి: ఎంపీ వేమిరెడ్డి

జిల్లా అభివృద్ధికి తొలి ప్రాధాన్యతగా పనిచేస్తామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాస్థాయిలో పరిష్కరించుకోదగని సమస్యలకు ఇక్కడే పరిష్కారం చూపుతామన్నారు. ఒక వేళ విషయం రాష్ట్ర స్థాయిలో, కేంద్ర స్థాయిలో పరిష్కరించాల్సి వస్తే తప్పకుండా ఎంపీగా తాను, జిల్లా మంత్రులుగా నారాయణ, ఆనం సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జిల్లాకు సంబంధించి కేంద్ర స్థాయిలో పరిష్కారం కాగల సమస్యలేమైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ప్రాంతంలో సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, కె రామకృష్ణ, ఇంటూరి నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడుతో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా జామాయిల్ నరికివేత

- ప్రభుత్వ, అగ్రిగోల్డ్ భూముల్లో జోరుగా సాగుతున్న వైనం
- రూ.లక్షలు బొక్కేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- వాహనాలను పట్టుకొని వదిలేస్తున్న వైనం
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి


వివాదాస్పద భూముల్లో జామాయిల్ చెట్ల నరికివేత (ఫైల్)

ఉదయగిరి: మండలంలోని పలు వివాదాస్పద భూములు, అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ చెట్లను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నరికి విక్రయిస్తూ భారీగా గడిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతోంది.

అధికారుల ప్రేక్షకపాత్ర

మండలంలో ఈ తంతు కొన్ని నెలలుగా జరుగుతున్నా, అధికారులు మౌనం వహిస్తున్నారు. స్థానికుల ఒత్తిళ్లతో వాహనాలను అడపాదడపా పట్టుకొని సీజ్ చేశామంటూ పత్రిక ప్రకటనలిస్తున్నారు. అయితే రెండు, మూడు రోజుల తర్వాత వాహనాలు మాయమవుతున్నాయి. ఇందులో ఉన్న జామయిల్ కర్ర కనిపించదు. దీనిపై పోలీసులు, రెవెన్యూ శాఖలు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ ప్రభుత్వ సొమ్ముకు ఎసరు పెడుతున్నారు. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది.


అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న లారీ

జామాయిల్‌కు మంచి గిరాకీ

జామాయిల్ కర్రకు మంచి గిరాకీ ఉండటంతో అధికార పార్టీ, అధికారుల అండ చూసుకొని కొందరు వ్యక్తులు అక్రమంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ ధరల మేరకు ఒక లారీ జామాయిల్ కర్ర రూ.1.5 లక్షల వరకు పలుకుతోంది. పైసా పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం వస్తుండటంతో అడ్డొచ్చిన అధికారులను ప్రసన్నం చేసుకుంటూ తమ పనిని కానిస్తున్నారు.

అగ్రిగోల్డ్ భూములనూ వదల్లేదు

మండలంలోని తిరుమలపురం పంచాయతీలో సర్వే నంబర్ 150, 151లో అగ్రిగోల్డ్ భూములున్నాయి. ఆ సంస్థను ఎత్తేయడంతో భూములను సీఐడీ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొని రక్షణ నిమిత్తం రెవెన్యూ, పోలీసులకు అప్పగించారు. అయితే ఇక్కడ సైతం అక్రమార్కులు వదలకుండా యథేచ్ఛగా కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు

వివాదాస్పద భూముల్లో జామాయిల్‌ను అక్రమంగా నరికి లోడ్ చేసి లారీ ద్వారా తరలిస్తుండగా, రెవెన్యూ అధికారులు ఈ ఏడాది మే 28న స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. అయితే వారం తర్వాత ఈ లారీ పోలీస్‌స్టేషన్ నుంచి మాయమైంది. అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను నరికి లారీలో తరలిస్తుండగా, రెవెన్యూ, అటవీ అధికారులు, పోలీసులు ఇటీవల అడ్డుకొని స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజల తర్వాత అది స్టేషన్ వద్ద లేదు. దీనిపై ప్రశ్నిస్తే ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు పేర్కొంటున్నారు.

బోగస్ పట్టాలు సృష్టించి..

ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 956, 957, 958లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూములను ఎనిమిది మంది ప్రభుత్వోద్యోగుల పేరుపై 2013, 14లో అప్పటి తహసీల్దార్ ప్రమేయంతో బోగస్ పట్టాలు సృష్టించి రికార్డుల్లో నమోదు చేశారు. ఇందులో జామాయిల్‌ను సాగు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులకు స్థానికులు తెలియజేశారు. విచారణ జరిపిన అధికారులు ఈ భూములను వివాదాస్పద భూములుగా ప్రకటించారు. అయితే రికార్డుల్లో మాత్రం ప్రభుత్వ భూములుగా నమోదు చేయలేదు. 1284 సర్వే నంబర్‌లోని భూములపై సైతం కేసు నడుస్తోంది.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్పీ కృష్ణకాంత్

మనుబోలు: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చోరీకి గురైన సొత్తును రికవరీ చేసేలా దృష్టి సారించాలని సూచించారు. కేసులను సత్వరమే పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించాలని, ద్విచక్రవాహనాలు నడిపే సమయాల్లో హెల్మెట్‌ను విధిగా ధరించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకొని.. తుప్పుపడుతున్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని తెలిపారు. హైవే పక్కన, దాబాల వద్ద రోడ్డు మార్జిన్‌లో లారీలు, ఇతర వాహనాలను నిలపకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరు టౌన్, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, సీఐ రాంబాబు, ఎస్సై అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణకాంత్

మెరుగైన గ్రామాభివృద్ధే లక్ష్యం

అనుమసముద్రంపేట: మెరుగైన గ్రామాభివృద్ధి కోసమే సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఏపీ ఎస్సైఆర్డీ రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలు మంచి పరిపాలనను అందించాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. తాగునీరు, పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం, వీధి దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు అందజేశారు. ఆత్మకూరు డివిజన్ పంచాయతీ అధికారి నారాయణ, శిక్షణ నిర్వాహకులు యస్దానీ బాషా, ప్రతాప్, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

గేదెను బైక్ ఢీకొని..


గాయపడిన కొండయ్య

సీతారామపురం: గేదెను ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో గల పూసలకాలనీ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నెల్లూరు నుంచి గుండుపల్లికి బైక్‌పై కొండయ్య దంపతులు బయల్దేరారు. ఈ క్రమంలో అడ్డొచ్చిన గేదెను ఢీకొన్నారు. గాయపడిన ఆయన్ను 108లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.105
సన్నవి : రూ.80
పండ్లు : రూ.60



కిశోర్‌ది రాజకీయ హత్యే

- భార్య మమత, తల్లి జయమ్మ ఆవేదన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బుర్రా


బుర్రాతో తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్న కిశోర్ భార్య, తల్లి

కందుకూరు రూరల్: పట్టణంలోని మూడో వార్డు ఉప్పుచెరువు కాలనీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎనుబరి కిశోర్ (35) మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో బాధిత కుటుంబసభ్యులను పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కిశోర్ భార్య మమత, తల్లి జయమ్మ తమ ఆవేదనను ఆయనతో వ్యక్తపర్చారు. కిశోర్ మృతి చెంది మూడు నెలలవుతున్నా, ఇంత వరకు కేసుపై పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పోస్ట్‌మార్టం నివేదిక వస్తేనే తాము కేసును తేల్చగలమని చెప్తున్నారని వాపోయారు. పోస్ట్‌మార్టం చేసిన ఏరియా వైద్యశాలకు వెళ్తే సాకులు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి మనిషి మరణించి తాము ఏడుస్తుంటే డబ్బులు తీసుకొని కేసు రాజీ చేసుకున్నారంటూ కొందరు ఆరోపిస్తుండటం బాధ కలిగిస్తోందన్నారు. మనిషే పోయాక.. డబ్బులెందుకని.. తమకు న్యాయం కావాలని కోరారు. తమకు అనుమానం ఉన్న వ్యక్తుల వివరాలను పోలీసులకు తెలిపినా, వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి సాయంత్రానికి వదిలేస్తున్నారని చెప్పారు. కాగా ఈ ఘటనపై పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశానని బుర్రా తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇది రాజకీయ హత్యగానే అనుమానించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనుమానిత వ్యక్తులు బయట తిరుగుతున్నా, పోలీసులు పట్టించుకోవడం లేదంటే కారణం ఏమనుకోవాలని ప్రశ్నించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులకు దిగారు

ఇప్పటికే ఒకటి జరిగింది.. మరొకటి జరగకుండా చూసుకోండంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఉప్పుచెరువుకు చెందిన ఓ టీడీపీ నేత, కార్యకర్త బెదిరించారని కిశోర్ భార్య, తల్లి ఆరోపించారు. ఇంత బహిరంగంగా మాట్లాడుతున్నారంటే వారిని అనుమానించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది కచ్చితంగా హత్యేనేనని తెలిపారు. ఫోన్ కాల్ డేటా తీస్తే విషయాలు బయటకొస్తాయని పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 101
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 153

క్లుప్తంగా

పాముకాటుకు బాలుడి మృతి


రోదిస్తున్న తల్లిదండ్రులు

జలదంకి: పాముకాటుకు గురై మండలంలోని తిమ్మసముద్రం గిరిజన కాలనీకి చెందిన బాలుడు శనివారం మృతి చెందారు. గ్రామస్తుల కథనం మేరకు.. తలపల మాల్యాద్రి, వెంకటరమణమ్మ కుమారుడు దుర్గాప్రసాద్ (13) స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఇంటి పక్కనే ఉన్న పొలం వద్దకు బహిర్భూమి నిమిత్తం శనివారం ఉదయం వెళ్లారు. అక్కడ పాము కాటుకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కావలి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. బాలుడి మృతితో తిమ్మసముద్రం గిరిజన కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయ రహదారిపై ఇద్దరి మృతి

కావలి: మండల పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. మండలంలోని చెన్నాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సుమారు 50 ఏళ్ల వ్యక్తి మరణించారు. అదే విధంగా భిక్షాటన చేసే 45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి చెంచుగానిపాళెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మరణించారని చెప్పారు. వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదాలు సంభవించాయన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టు పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జీజే రావు

ముత్తుకూరు: పోర్టు పరిధిలోని 19 మత్స్యకార సంఘాలు, 32 గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు పేర్కొన్నారు. అదానీ సంస్థల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముత్తుకూరు, కృష్ణపట్నం ఉన్నత పాఠశాలల్లో విద్య, ఆరోగ్యంతో పాటు గ్రామాల్లో తాగునీరు, జీవనోపాధి, పారిశుధ్యం, మహిళా సాధికారత తదితరాల్లో కీలకపాత్రను పోషిస్తున్నామని చెప్పారు. సీఓఓ రాజన్‌బాబు, ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, గణేష్‌శర్మ, వేణుగోపాల్, వెంకటేష్‌భాస్కరన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొండాపురం: మోటార్ వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని శెట్టిపాళెం పంచాయతీ తూర్పు జంగాలపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తడకలూరి పాపరాజు (35) తన పొలంలో త్రీ ఫేజ్ వైర్లకు సపోర్టుగా ఇనుప తీగను అమర్చారు. ఈ క్రమంలో వైర్లను సరిచేస్తుండగా, ఇనుప తీగకు విద్యుత్ సరఫరా అయింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.



అదుపుతప్పిన ద్విచక్రవాహనం

మర్రిపాడు: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. రామానాయుడుపల్లికి చెందిన ఓ వ్యక్తి నందవరం నుంచి ఆత్మకూరు బయల్దేరారు. ఈ క్రమంలో డీసీపల్లి వద్దకొచ్చే సరికి వాహనం అదుపుతప్పింది. క్షతగాత్రుడ్ని అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ బోల్తా

దొరవారిసత్రం: లారీ బోల్తాపడిన ఘటన దొరవారిసత్రం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ దొరవారిసత్రం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ మారిముత్తు గాయపడ్డారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.